ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 7 డిసెంబరు 2025

రెండో విడత.. తేలిన లెక్క

- భూపాలపల్లి జిల్లాలోని నాలుగు మండలాల్లో జీపీ ఎన్నికలు
- పూర్తయిన నామినేషన్ల ఉపసంహరణ పర్వం
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ

కృష్ణకాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి, టేకుమట్ల, పలిమెల, చిట్యాల మండలాల్లో ఎన్నికలు జరుగుతుండగా నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శనివారం ముగిసింది. టేకుమట్ల మినహా మిగతా మండలాల అభ్యర్థులను అధికారులు ప్రకటించారు. టేకుమట్ల నామినేషన్ల ఉప సంహరణ పలు సాంకేతిక కారణంగా ఆలస్యంగా అర్ధరాత్రి వరకు కొనసాగింది.

అభ్యర్థులు వీరే...

భూపాలపల్లి మండలంలో 26 సర్పంచ్ స్థానాలు ఉండగా మొత్తం 132 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 2 స్థానాలు (బావ్‌సింగ్‌పల్లి, శ్యాంనగర్) ఏకగ్రీవం అయ్యాయి. అలాగే, 56 మంది ఉపసంహరించుకన్నారు. ఇంకా మిగిలిన 24 స్థానాల్లో 74 మంది బరిలో నిలిచారు. మొత్తంగా 216 వార్డు స్థానాలు ఉండగా 520 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 44 స్థానాలు ఏకగ్రీవం కాగా 63 మంది ఉపసంహరించుకున్నారు. మిగిలిన 172 వార్డు స్థానాల నుంచి 413 మంది పోటీలో నిలుస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పలిమెల మండలంలో 8 సర్పంచ్ స్థానాలు ఉండగా 31 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో పలిమెల గ్రామం ఒకటి ఏకగ్రీవమైంది. 9 మంది ఉపసంహరించుకోగా ఇంకా 7 సర్పంచ్ స్థానాల్లో 21 మంది పోటీలో నిలిచారు. మొత్తం 62 వార్డు స్థానాలు ఉండగా మొత్తం 109 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఒకటి రిజెక్టు కాగా ముగ్గురు ఉపసంహరించుకున్నారు. పలిమెల మండల వ్యాప్తంగా ఒక సర్పంచ్ స్థానంతో పాటు 24వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియడంతో మండల వ్యాప్తంగా 9మంది సర్పంచ్, ముగ్గురు వార్డు మెంబరు అభ్యర్థులు తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. ఒక సర్పంచ్, 24వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మండల వ్యాప్తంగా 85 వార్డు స్థానాల్లో 81 మంది పోటీలో నిలిచారు. చిట్యాల మండలంలోని మొత్తం 26 సర్పంచ్ స్థానాలకు 162 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఐదు స్థానాలు ఏకగ్రీవం కాగా 81 ఉపసంహరించుకున్నారు. మిగిలిన 21 సర్పంచ్ స్థానాలకు ఇంకా 76 మంది పోటీలో నిలిచారు. 218 వార్డులకు 555 మంది (మిగతా 8వ పేజీలో)



డీసీసీ చీఫ్‌లకు పంచాయతీ సవాల్

- మంత్రి, ఎమ్మెల్యేలు, కీలక నేతలు, ఇన్‌చార్జిల సహకారంపై అనుమానాలు
- అధ్యక్ష పీఠం దక్కని నేతల్లో అసంతృప్తిపై దృష్టిసారించని అధిష్ఠానం
- డీసీసీ అధ్యక్షులే అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లాల్సిన పరిస్థితి
- బాధ్యతలు చేపట్టగానే ఎన్నికలు రావటంతో ఆందోళన
- సారథుల పనితీరుకు పంచాయతీ పరీక్ష

మెజారిటీ స్థానాల్లో గెలుపే తొలి టాస్క్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ పార్టీలో నూతన డీసీసీ అధ్యక్షుల సత్తాకు పంచాయతీ ఎన్నికలు పరీక్షగా మారాయి. బాధ్యతలు చేపట్టగానే సర్పంచ్ ఎన్నికలు రావటంతో మెజారిటీ స్థానాల్లో గెలుపు సాధించటంతో పాటు అన్ని వర్గాలను సమన్వయం చేయటం డీసీసీ చీఫ్‌లకు సవాల్‌గా మారింది. సీనియర్ నేతలు అనేకమంది డీసీసీ పదవిపై ఆశతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొన్ని జిల్లాల్లో సామాజిక సమీకరణల పేరుతో ఊహించని నేతలకు పదవిని కట్టబెట్టారు. అయితే అధ్యక్ష పదవిని ఆశించిన నేతల్లోని అసంతృప్తిపై అధిష్ఠానం చర్చించకపోవటంతో పంచాయతీ ఎన్నికల్లో వారి సహకారంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా మంత్రి, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు డీసీసీ చీఫ్‌ల ఆధిపత్యాన్ని అంగీకరించి, వారితో కలిసి పని చేస్తారా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.

కొత్త అధ్యక్షులకు తొలి పరీక్ష

అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమించింది. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాల నుంచి వందలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధిష్ఠానం సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకునే జిల్లా అధ్యక్షులను నియమించిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అయూబ్, జనగామ జిల్లా అధ్యక్షురాలిగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా ఎమ్మెల్యే మురళీ నాయక్ సతీమణి ఉమా, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా భట్టు కరుణాకర్, ములుగు జిల్లా అధ్యక్షుడిగా పైడాకుల అశోక్‌లను అధిష్ఠానం నియమించింది. ఒక్క ములుగు జిల్లాకు మాత్రం మంత్రి సీతక్క ఒత్తిడితో పైడాకుల అశోక్ మినహా మిగతా అన్ని జిల్లాలకు కొత్తవారికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. వీరంతా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహే‌ష్‌గౌడ్ సమీక్షంలో డిసెంబరు 2వ తేదీన గాంధీభవన్‌లో అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధికా రంలో ఉండటంతో డీసీసీ అధ్యక్ష పదవికి (మిగతా 7వ పేజీలో)

ప్రచారంలో డీసీసీ చీఫ్‌లు ఎక్కడ..?

పంచాయతీ ప్రచారంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇంకా దిగలేదని తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో తమ మార్కు రాజకీయాన్ని చూపించి, మెజారిటీ స్థానాల్లో గెలుపు దిశగా పయనించేలా కార్యాచరణ రూపొందించలేదనే చర్చ నడుస్తోంది. ఈ నెల 11వ తేదీన ఉమ్మడి జిల్లాలో 555గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటి వీటిలో 39వరకు ఏకగ్రీవం కావటంతో మిగతా పంచాయతీల్లో అభ్యర్థులే ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బరువు, బాధ్యతలను భుజస్కందాలపై వేసుకుని ముందుకు వెళుతున్నారు. అయితే కొత్త అధ్యక్షులు ప్రచారంలో హుషారుగా పాల్గొన్న దాఖలాలు లేవనే చర్చ నడుస్తోంది. అధిష్ఠానం కూడా కొత్త అధ్యక్షుల పనితీరుపై ఆరునెలలు పరీక్షించాలని నిర్ణయించింది. పంచాయతీ, ఆ తరువాత వచ్చే పరిషత్తు ఎన్నికల్లో పనితీరు బాగాలేక పోతే డీసీసీ చీఫ్‌ల పీఠాలను కదిలించే అవకాశం లేకపోలేదనే చర్చ పార్టీ కేడర్‌లో జరుగుతోంది.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క



దుంపెల్లిగూడెంలో మంత్రి సీతక్కకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

గోవిందరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రజలు, పార్టీ శ్రేణులను కోరారు. మండలంలోని దుంపెల్లిగూడెం, రాంనగర్ గ్రామాల్లో మొదటి విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పదేళ్లకాలంలో బీఆర్ఎస్ ఏ ఒక్క గ్రామాన్ని కూడా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్లలోనే ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకున్నట్లయితే మరింత అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, సర్పంచ్ అభ్యర్థులు జోగానాయక్, భూక్య రాజునాయక్, ఆలోత్ స్రవంతి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన హైకోర్టు జడ్జి



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న హైకోర్టు జడ్జి వేణుగోపాల్

వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని హైకోర్టు జడ్జి ఈవీ.వేణుగోపాల్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా అర్చకులు ఆయన్ను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న జడ్జి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో (మిగతా 8లో..)

ఉన్నత విద్య కోసం వెళ్లి..

- అమెరికాలో అగ్నిప్రమాద ఘటనలో యువతి దుర్మరణం
- స్వస్థలం స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని గుంటూరుపల్లి
- ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కుటుంబం
- 11న రానున్న మృతదేహం... అదే రోజు స్వగ్రామంలో అంత్యక్రియలు



సహజారెడ్డి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం అమెరికాలోని బర్మింగ్‌హామ్ వెళ్లిన విద్యార్థిని అక్కడ జరిగిన అగ్ని ప్రమాదంలో మృత్యువాత పడడంతో స్వగ్రామం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామ పరిధిలోని గుంటూరుపల్లిలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి- గోపు మరియాశైలజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సహజారెడ్డి (24)ఎంఎస్ చేయడానికి (మిగతా 8లో..)

మూగజీవాల మృత్యుఘోష

- గంట వ్యవధిలో 18 మేకలు, గొర్రెలు మృతి
- హతాశుడై స్పృహ కోల్పోయిన కాపరి



పరుశురాంపల్లిలో మృతి చెందిన మూగజీవాలు

గణపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మూగ జీవాలు కొన్ని నిమిషాల వ్యవధిలోనే వరుసగా మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని పరుశురాంపల్లి ఓపెన్‌కాస్టు-3 సమీపంలో శనివారం చోటుచేసుకుంది. బాధిత కాపరి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కాపరి గాజుల సారయ్య రోజూ మాదిరిగానే శనివారం తనకున్న గొర్రెలు, మేకలను గ్రామ శివారుకు మేతకు తీసుకెళ్లాడు. మేత మేస్తు న్న క్రమంలో ఓపెన్‌కాస్టు -3 నుంచి వెలువడే నీటిని మూగజీవాలు తా గాయి. వెంటనే కొన్ని నిమిషాల వ్యవధిలోనే 18 మూగజీవాలు ఒక్కొక్కటిగా నేలకొరి ప్రాణాలు కోల్పోయాయి. ఇది చూసిన కాపరి సారయ్య హతాశుడై అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని సారయ్యను భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓపెన్‌కాస్టు నుంచి వెలువడిన రసాయనాల వల్లే తమ మూగ జీవాలు మృతి చెందాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పశు వైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం పశువులకు ఎలాంటి వ్యాధులు లేవని అన్నారు. మృతి చెందిన మూగజీవాల శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పం పిస్తున్నామని తెలిపారు. మూగజీవాలు ఎలా మృతి చెందాయనేది నివే దికలు వస్తేనే చెప్పగలమని అన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకోవాలంటూ బాధిత కుటుంబం కన్నీరుమున్నీరైంది.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు భట్టు కర్ణాకర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని కించపరిచే చర్యలు జరుగుతున్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఈ క్రమంలో రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దీని కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్విరామంగా కృషి చేస్తున్నారని అన్నారు. దేశంలో ఐక్యత కోసం ఆయన పాటుపడుతున్నారని అన్నారు. గ్రామాల్లో కులమత బేదాలు లేకుండా అందరూ సమానమే అనే విధానాన్ని తీసుకురావాలని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజాంగ్యాన్ని పూర్తిగా మార్చాలని చూస్తోందని దుయ్యబట్టారు. దీనిని కాపాడుకోవడం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇస్లావత్ దేవన్, అంబాల శ్రీనివాస్, రాజేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ములుగు అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11న మొదటి విడతలో జరగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ములుగు అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు అన్నారు. ఎన్నికల నిర్వహణపై మండలకేంద్రంలో ఆర్‌వో, ఏఆర్‌వో, పీవోలకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి విబేధాలు, పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలింగ్ సామగ్రిని జాగ్రత్తగా చూసుకోవాలని, బ్యాలెట్ పేపర్ల విషయంతో పకడ్బందీగా వ్యవహరించాలని అన్నారు. ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా కోరం ఉందా.. లేదా? అనే విషయాలను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, పీవోలు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్

గణపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. మండలకేంద్రంలోని రైతు వేదకలో ప్రిసైడింగ్ అధికారులు, స్టేజ్-2 అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఏమైనా సందేహాలు ఉంటే శిక్షణ తరగతుల్లో నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి చిన్న పొరపాటుకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని అన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తర్వాత కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు అదే రోజు చేరుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగుస్తుందని, అప్పటికే ఓటర్లు పోలింగ్ కేంద్రంలో వేచి ఉంటే క్యూలైన్ వెనుక నుంచి ముందు వరకు సీరియల్ నెంబర్ల స్లిప్‌ల జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల ప్రత్యేక అధికారి కుమారస్వామి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, మాస్టర్ ట్రైనర్లు శ్రీధర్, రఘునాథ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి తీవ్రగాయాలు

కాటారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రం శివారులో బొప్పారం క్రాస్ రోడ్డు వద్ద 353(సీ)జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిద్నెపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీనివాసకాలనీకి చెందిన గొడిశెల రాజిరెడ్డి వ్యక్తిగత పనినిమిత్తం కాటారం వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డును దాటుతుండగా గోదావరిఖనికి చెందిన అనిరుద్ర మహదేవపూర్ వైపు కారులో వెళ్తూ బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై నుంచి రాజిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

క్రీడలకు సింగరేణి ప్రోత్సాహం

ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలను సింగరేణి సంస్థ ఎంతో ప్రోత్సహిస్తోందని ఆ సంస్థ ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియంలో వర్క్ పీపుల్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భూపాలపల్లి ఏరియా, రామగుండం ఏరియా-3ల క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరిలోనూ మానసికోల్లాసం, సానుకూలతను నింపుతాయన్నారు. నేటి ఆధునిక జీవన విధానంలో బ్యాలెన్స్ కోసం క్రీడల పాత్ర మరింత ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. అనంతరం ఇటీవల జరిగిన కోల్ ఇండియా కబడ్డీ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులను జీఎం సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వివిధ యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

బొత్తలతండా ఏకగ్రీవం

● కూతురు సర్పంచ్.. తండ్రి ఉపసర్పంచ్‌గా ఎన్నిక

పెద్దవంగర, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూతురు సర్పంచ్, తండ్రి ఉప సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నికకావడం ఆసక్తికరం గా మారింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని బొత్తల తండా, బీమ్లాతండా రెండు తండాలను కలిపి 225 ఓటర్లతో నూతన జీపీగా ఏర్పాటు చేశారు. బొత్తలతండాలో 153 ఓటర్లు ఉండగా బీమ్లాతండాలో 72 ఓటర్లు ఉన్నారు. వారిలో 110 మహిళలు, 115 పురుషులు ఉన్నారు. నూతన జీపీ పరిధిలో 4వార్డులుగా ఏర్పాటు చేయగా ఒకరు సర్పంచ్‌గా, వార్డు సభ్యులు గా ఐదుగురు నామినేషను వేశారు. అదివారం ఉపసంహరణ ప్రక్రియలో భాగంగా ఒక నామినేషన్ ఉపసంహరించు కోవడంతో బొత్తలతండా గ్రామ పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమైంది. సర్పంచ్‌గా బొత్తలతండాకు చెందిన జాటోతు కల్పన, వార్డు సభ్యులలో బీమ్లాతండాకు చెందిన అంగుతో లచ్చిరామ్‌నాయక్ ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. దీంతో కూతురు సర్పంచ్‌గా, తండ్రి ఉపసర్పంచ్‌గా ఎన్నికకావడం తండాలో ఆసక్తికరంగా మారింది.

అక్రమ అరెస్టులు సరికాదు

తొర్రూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమ అరెస్టులు సరికాదని సీపీఐ రాష్ట్ర నాయకుడు తమ్మెర విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడు తూ తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని దరఖాస్తుదారులతో కలిసి గత ఆరు నెలలుగా సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు, దీక్షలు చేస్తున్న వారిని అరెస్టు చేసి జైలుకు తరలించడా న్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించి, పంపిణీ చేతకాక వది లివేయడంతో ప్రజా ప్రభుత్వం పంపిణీ చేయకుండా అరెస్టులు చేయడం సిగ్గుచేటని, వెంటనే లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కేసులు ఎత్తివేసి సీపీఎం నాయకులను విడుదల చేయాలన్నారు. కమ్యూనిస్టులపై కేసులు పెడితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం బాధ్యులు

మరిపెడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 76వ వర్ధంతిని మరిపెడ విలేజీ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చూపిన మార్గం గొప్పదని కొనియాడారు. భాషిపంగు రంజిత్, డేవిడ్‌రాజు, కృష్ణ, సురేశ్, వెంకటేశ్, రవికాంత్, పరశు రాములు, హరీశ్, సునీల్, భాలకృష్ణ, రాకేశ్, అశోక్, రాజా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవమైంది వీరే..

తొర్రూరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని ఒక సర్పంచ్ అభ్యర్థి, 39వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు వెల్లడించారు. మండలంలోని 31గ్రామ పంచాయతీల్లో దుబ్బతండా గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన బాదావత్ విజ యలింబా, గ్రామంలోని 8వార్డులకుగాను 7వార్డుల సభ్యులు ఏక గ్రీవంగా ఎంపికయ్యారని, 3వ వార్డులో జాటోత్ నాజీ, బుజ్జి బరిలో ఉండటంతో ఎన్నిక నిర్వహిస్తామన్నారు. అలాగే మండ లంలోని బోజ్యాతండా, టీక్యాతండా 6వార్డుల చొప్పున, హచ్చు తండాలో 3, అమర్‌సింగ్‌తండా, చీకటాయపాలెం, గోపాలగిరి, కిష్టాపురం, పెద్దమంగ్యా తండా, పోలేపల్లి గ్రామాల్లో 2చొప్పున, చెర్లపాలెం, చింతలపల్లి, ఈదులకుంటతండా, జమస్థాన్‌పురం, సోమారం గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున వార్డు సభ్యులు ఏకగ్రీ వంగా ఎంపికయ్యారని తెలిపారు.

● చిన్నగూడూరు (మరిపెడ) (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండలం మేఘ్యాతండా జీపీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ జీపీకి నలుగురు సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. శనివారం ముగ్గురు సర్పంచ్ అభ్య ర్థులు ఉపసంహ రించుకోవడంతో బాదావత్ జయప్రకాశ్ (రెడ్డి) స్వతంత్ర అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8వార్డులకు 16గురు వార్డు అభ్యర్థు లుగా నామినేషను దాఖలు చేశారు. వారిలో 8మంది ఉపసంహరించుకోవడంతో గ్రామంలోని వార్డు లన్నీ ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఉప సర్పంచ్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి గుగులోత్ వీరన్న ఎన్నికయ్యారు. వార్డు సభ్యులుగా బాదావత్ జ్యోతి, భూక్యా సురేశ్, గుగులోత్ సావిత్రి, బాదావత్ మంగీలాల్, బాదావత్ బద్రి, వెన్నెల, రామకోటి ఎన్నికయ్యారు.

● నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం) (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపతండ గ్రామ పంచాయతీ సర్పంచ్‌తో పాటు, ఎనిమిది వార్డులు ఏకగ్రీవమైంది. సర్పంచ్ అభ్యర్థిత్వానికి కాంగ్రె స్ మద్దతుదారుడు అజ్మీర రాజేందర్, బీఆర్ఎస్ మద్దతు దారు డు లావూడ్య శ్రీను నామినేషన్ వేశారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి లావూడ్య శీను తన నామినేషన్‌ను శనివారం విత్ డ్రా చేసుకోవ డంతో సర్పంచ్ బరిలో అజ్మీర రాజేందర్ నామినేషన్ ఒక్కటే ఉండడంతో ఏకగ్రీవం కానున్నారు. అదే విధంగా ఎనిమిది వార్డులకు ఒక్కొక్క నామినేషన్ ఉండడంతో ఎనిమిది వార్డులు ఏకగ్రీవం కానున్నాయి. అదేవిధంగా బక్కతండా జీపీలో ఏడు వార్డులు, జయపురం జీపీలో ఐదు వార్డులు, ముంగిమడుగు జీపీలో ఐదు చొప్పున వార్డులకు ఒక్కొక్క నామినేషన్ ఉండడంతో ఏకగ్రీవం కానున్నాయి. ఈ నెల 14న ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించి గెలుపు పత్రాలు అందించనున్నారు.

● పెద్దవంగర (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల్లో సర్పం చ్, వార్డు సభ్యుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శని వారం ముగిసింది. మండల పరిధిలో మొత్తం 26 గ్రామాలు ఉండగా వాటిలో ఆరు గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఖండ్యతండాలో ధరవత్ శంకర్ (ఎస్టీ జనరల్), రామోజీతండాలో గుగులోతు మాలని (ఎస్టీ మహిళ), బొత్తలతండాలో జాటోత్ కల్పన (ఎస్టీ మహిళ), జయరామ్‌తండాలో బానోతు విజయ (ఎస్టీ మహిళ), టీక్యాతండాలో జాటోతు దివ్యభారతి (ఎస్టీ జనరల్)లు సర్పంచ్‌లుగా ఏకగ్రీవం అయ్యారు. కాగా, స్వతంత్ర అభ్యర్థి బీఆర్ఎస్, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి వంపుతండా సర్పంచ్‌గా ధరవత్ వినోద (ఎస్టీ మహిళ) ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన 20 గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులు బరిలో ఉండగా వారికి ఆయా రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించారు.

ఘనంగా గౌడ కులస్థుల బోనాల పండుగ

చిన్నగూడూరు (మరిపెడ), డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): చిన్నగూడూరు గౌడ కులస్థులు శనివారం కంఠమహేశ్వరుడి తిరుగు సంవత్సరం పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరే గింపుగా కంఠమహేశ్వరుడి గుడికి తరలివెళ్లి గౌడ కుల దేవతలకు మొక్కులు చెల్లించి నేవేద్యం సమ ర్పించారు. అంగరంగ వైభవంగా తిరుగు సంవత్సరం పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు గాడిపెల్లి నర్సయ్య, వెంకన్న(లడ్డు) తదితరులు పాల్గొన్నారు. పూజారు లు ప్రత్యేక పూజలు జరిపారు.



బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్తున్న మహిళలు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

చిలుపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని బ్రైడ్ స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం రాజవరంలో మహిళల కుట్టుశిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 55 మందికి గుర్తింపు పత్రాలను అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ టైలరింగ్ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో జన వికాస గ్రామీణాభివృద్ధి సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పెండ్లి సంపత్‌కుమార్, ట్రెయినీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



ప్రోత్సాహక బహుమతిని అందుకుంటున్న గణేశ్

లింగాలఘణపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఇన్స్పైర్-2025లో లింగాలఘణపురం మోడల్ స్కూల్‌కు చెందిన టెన్త్‌క్లాస్ విద్యార్థి కేమిడి గణేశ్ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయిలో ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు. చేవెళ్ల మోడల్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయిలో 194 పాఠశాలల నుంచి 388 అంశాలను ప్రదర్శించగా అందులో గణేశ్ వాయిస్ కంట్రోల్ వీల్ చైర్ అంశంపై ప్రత్యేకమైన ప్రతిభను చాటారు. గణేశ్‌తో పాటుగా గైడ్ టీచర్లు సంతోష్‌రెడ్డి, రాజేశ్, కృష్ణవేణిలను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత అభినందించారు.

వావిలాలలో రోడ్డు ప్రమాదం

● సన్నాయి కళాకారుడు దుర్మరణం

● మృతుడిది మహబూబాబాద్ జిల్లా రామాంజపురం



మధు (ఫైల్)

పాలకుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో సన్నాయి కళాకారుడు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామాంజపురం గ్రామానికి చెందిన ఆవుదొడ్డి సంగయ్య, లక్ష్మీ కుమారుడు ఆవుదొడ్డి మధు (21) వృత్తి రీత్యా సన్నాయి కళాకారుడు. వృత్తిలో భాగంగా స్వగ్రామం రామాంజపురం నుంచి తోటి కళాకారులతో కలిసి మోటార్ సైకిల్‌పై పాలకుర్తికి వస్తున్నాడు. వావిలాల విద్యుత్ సబ్‌స్టేషన్ మూల మలుపు వద్ద ఆగి ఉన్న టాటాఏస్ వాహనాన్ని మోటార్ సైకిల్ ఢీకొనడంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

● రూ.లక్ష అస్తి నష్టం



మంటలు అర్పుతున్న ఫైర్ సిబ్బంది

మరిపెడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గడ్డి ట్రాక్టర్ దగ్ధమై రూ.లక్ష అస్తి నష్టం జరిగిన సంఘటన శనివారం మరిపెడ మండలం గుర్రప్పతండాలో చోటు చేసుకుంది. బాధిత రైతు గుగులోత్‌వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. వీరన్న తనకు ఉన్న రెండేకరాల గడ్డిని అదే తండాకు చెందిన హలావత్ రాములు ట్రాక్టర్‌లో పొలం నుంచి ఇంటికి తీసుకొస్తుండగా రోడ్డుపై కరెంట్ తీగలు గడ్డికి తాకడంతో మంటలు వ్యాపించి గడ్డి మొత్తం మంటల్లో దగ్ధమై యింది. ట్రాక్టర్ తొట్టి పాక్షికంగా పాడైయ్యింది. రూ.లక్ష అస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు కుటుంబం బోరున విలపిస్తుంది. విద్యుత్ అధికారులకు కిందికి వేలాడుతున్న తీగలను సరి చేయాలని పలుమార్లు విన్నపించిన పట్టింపులేదని ఆ తండా రైతులు ఆరోపిస్తున్నారు.

పోలీస్ విధుల్లో హోంగార్డుల పాత్ర కీలకం



హోంగార్డులకు జ్ఞాపికను అందిస్తున్న ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

కృష్ణకాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధి నిర్వహణలో హోంగార్డుల పాత్ర కీలకమని భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాల యంలో 63వ హోంగార్డు రైజింగ్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎస్పీ పాల్గొ న్నారు. ముందుగా హోంగార్డుల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 104 మంది హోంగార్డులు అంకితభావంతో విధు లు నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు బలమైన అండగా నిలుస్తు న్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందన, బందో బస్తు విధులు, ప్రజా రక్షణ చర్యల్లో వారి సేవలు ప్రశంస నీయమని కొనియాడారు. అనంతరం బందోబస్తు విధుల్లో ప్రతిభ చూపిన 10 మంది హోంగార్డులను అభినందించి ప్రశంసా పత్రాల్ని అందించారు. ఇటీవల మృతి చెందిన హోంగార్డు శంకర్ కుటుంబానికి చెక్కును అందించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, కాటారం డీఎస్పీ సూర్య నారాయణ, సీఐ నరేష్‌కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, హోంగార్డ్స్ ఆర్ఐ పూర్ణచందర్, ఆపరేషన్ ఆర్ఐ కాశీరాం, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి

● ఎన్నికల పరిశీలకుడు ప్రశాంత్ కుమార్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని సాధారణ ఎన్నికల పరిశీలకుడు ప్రశాంత్‌కుమార్ అన్నా రు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశి తంగా పరిశీలించాలని సూచించారు. ములుగు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు శనివారం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మై క్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన బాధ్యతలు కేటాయించినట్లు తెలిపారు. పోలిం గ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశి తంగా పరిశీలించగలుగుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందురోజు ఉదయం 6 గంటలకు డిస్ట్రిబ్యూ షన్ సెంటర్‌కు చేరుకుని సిబ్బందికి అందించే సామగ్రి సక్రమంగా ఉందా, లేదా అనేది పరిశీలించాలన్నారు. అనం తరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్‌స్టేషన్లకు చేరుకో వాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతుందా, లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలన్నారు. గమనించిన అం శాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోలిం గ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను గమనించాలన్నారు. సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్ సరిగా ఏర్పాటు చేశారా లే దా? పరిశీలించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో మరింత ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ జయప్రకాష్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి: డీఈవో

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భావి భారత శాస్త్రవేత్తలుగా విద్యార్థు లు ఎదగాలని, ఇందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని విద్యాశాఖ జిల్లా అధికారి (డీఈవో) ముద్దమల్ల రాజేందర్ అన్నారు. రెండు రోజులుగా జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజే తలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. డీఈవో మాట్లాడుతూ నేటి బాలలే భావి భారత పౌరు లని, వారిని దేశానికి గొప్ప శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి ఈ ప్రదర్శన దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, డీసీఈబీ కార్య దర్శి చంద్రశేఖర్, ఏఎంవో విజయ్‌పాల్‌రెడ్డి, సీఎంవో సామల రమేష్, ట్రస్మా అధ్యక్షుడు సాంబయ్య, శ్రీనివాస రావు, సతీష్, సంపత్‌రావు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు: సీఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఈనెల 17న జరిగే పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలుంటాయని మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బెగ్లూర్‌లో గ్రామస్తులు, యువకులతో ఆయన శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. ఒక వర్గానికి చెందిన వారు, మరో వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసి రాద్ధాంతం చేస్తే కఠిన చర్యలుంటాయని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే గ్రూప్ అడ్మిన్లపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు పవన్ కుమార్, టి.సాయిశశాంక్, గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తడి నేలల వివరాలివ్వండి




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షేత్రస్థాయిలో కమిటీ పర్యటించి చిత్తడి నేలల వివరాలను సమర్పించాలని కలెక్టర్ దివాకర అధికారు లను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు జిల్లాలో చిత్తడి నేలలు, దాని ప్రాముఖ్యత, చిత్తడి నేలల నోటిఫికేషన్ ఆవశ్యకత గురించి వివరించారు. కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి చిత్తడి నేలల డేటాను సమర్పించాలని సూచించారు. ఈసమావేశంలో ఆర్డీవో వెంకటేష్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, మునిసిపల్ కమిష నర్ సంపత్, డీఏవో సురేష్‌కుమార్, డీఐవో అప్పలనా యుడు, డీపీవో శ్రీధర్, మత్స్యశాఖ అధికారి సాల్మన్ రాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి

స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి మల్లేశ్వరి



మాట్లాడుతున్న మల్లేశ్వరి

చిట్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కుని అన్ని రంగాల్లో రాణించాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి మల్లేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐకేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లా డారు. మహిళలు పనిప్రదేశాలు, ఉద్యోగరీత్యా కార్యాల యాల వద్ద వేధింపులు, గృహహింస, వరకట్న వేధిం పులు, మోసపూరిత ప్రలోభాలకు గురిచేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్ల లను పాఠశాల స్థాయి నుంచే ఆత్మవిశ్వాసం, మనోధై ర్యాన్ని కల్పించాలని సూచించారు. విద్య, ఉద్యోగ, క్రీడా రంగాల్లో ప్రోత్సాహిస్తూ చట్టాలపై అవగాహన కల్పిం చాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం రాజేందర్, ఎంఎస్ అధ్యక్షురాలు కొక్కుల ఉమ, సూపర్‌వైజర్ జయ ప్రద, మహిళా శక్తి సిబ్బంది అనూష, మమత, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి ముగ్గురి సస్పెన్షన్

ములుగు టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి ముగ్గురిని మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను ధిక్కరిస్తూ పార్టీ వ్యతిరేక కార్యక లాపాలకు పాల్పడుతున్న మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, శానబోయిన అశోక్, కాశీందేవిపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అహ్మద్ పాషాను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై కాంగ్రెస్‌కు వీరికి ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని ప్రజలు, కార్యకర్తలు గ్రహించాలని వివరించారు.

'స్వచ్ఛ ఏవమ్'లో.. మెరిసిన పాఠశాలలు

- హనుమకొండ జిల్లా నుంచి 8 స్కూళ్లు ఎంపిక
- ఈ నెల 18న ప్రశంసాపత్రాల ప్రదానం
- త్వరలో జాతీయ స్థాయి ఎంపిక కసరత్తు





హనుమకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) కింద జిల్లాలో 8 పాఠశాలలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తపల్లిలోని ఎపీపీఎస్, దామెరలోని ఎంపీపీఎస్, ముస్త్యాలపల్లిలోని ఎంపీయూపీఎస్, పోచారంలోని ఎంపీపీఎస్, అంబాలలోని జడ్పీహెచ్‌ఎస్, కమలాపూర్‌లోని సాకేత ఉన్నత పాఠశాల, ధర్మసాగర్‌లోని కేజీబీవీ వీటిలో ఉన్నాయి. ఈనెల 18వ తేదీన మూడు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో కలెక్టర్ స్నేహ శబరీష్ వీటికి ప్రశంసాపత్రాలను ప్రదానం చేయనున్నట్లు సమాచారం.

రాష్ట్రస్థాయికి 8 స్కూళ్లు

జిల్లాలో మొత్తం 910 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఎస్‌హెచ్‌వీఆర్ కింద 335 పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ కార్యక్రమం కింద నిర్దేశించిన అంశాలను కచ్చితంగా అమలు చేస్తున్నందుకు మొదట 25 పాఠశాలలకు 5 స్టార్ రేటింగ్, 310 పాఠశాలలకు 4 స్టార్ రేటింగ్ వచ్చింది. ఆ తర్వాత 34 మంది సీనియర్ హెడ్మాస్టర్లతో ఏర్పాటు చేసిన కమిటీ మరోసారి జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఏవమ్ కింద దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను సందర్శించగా 8 పాఠశాలలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. త్వరలోనే రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక బృందం జిల్లాను సందర్శించి రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పాఠశాలలను సందర్శించి వీటిలో అర్హతలను బట్టి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తుంది. జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున పురస్కారం అందజేస్తారు.

రేటింగ్..

నీటి వసతి, పరిశుభ్రత, పారిశుధ్యం. పర్యావరణహిత పరిసరాలు, మొక్కలు, చెట్లతో పచ్చదనం విలసిల్లేలా స్కూల్ ప్రాంగణాలు మేటిగా ఉండేలా చూడడానికి ఈ స్వచ్ఛ ఏవమ్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జిల్లా స్థాయికి 3 స్టార్ రేటింగ్‌కు ఆరు పాఠశాలను, రాష్ట్ర స్థాయి ఎంపికకు 4 స్టార్ రేటింగ్‌కు 20 పాఠశాలలను జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్‌కు 200 పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమం కింద ఈ విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జరిగింది. ఈ విధానాన్ని అన్ని యాజమాన్యాల్లోని 1 నుంచి 10వ తరగతి వరకు ఉంటే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్కూళ్లకు వర్తిస్తుంది. జిల్లాలో 335 పాఠశాలల హెడ్‌మాస్టర్లు ఎస్‌హెచ్‌వీఆర్ వెబ్‌పోర్టల్‌లో ప్రతీ సూచికకు సంబంధించిన వివరాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేశారు. మొత్తం 6 ప్రధాన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా రేటింగ్ ఒకటి నుంచి 5 స్టార్లను కేటాయించారు.

60 అంశాల్లో..

నీటి వసతి, టాయిలెట్లు, విద్యార్థులు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవడం, ప్రవర్తన మార్పు, సామర్థ్యాల నిర్మాణం (కెపాసిటీ బిల్డింగ్), నిర్వహణ తదితర 60 అంశాలు నమోదు చేశారు. నమోదు విజయవంతంగా పూర్తి చేయగానే రేటింగ్ ప్రకారం ఫైవ్‌స్టార్ వస్తే అద్భుతం అని, ఫోర్ స్టార్ వస్తే చాలా బాగుంది అని, త్రీస్టార్ వస్తే బాగుంది అని, టూస్టార్ వస్తే సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉందని, వన్ స్టార్ వస్తే అతి తక్కువ అనే రేటింగ్‌లు వచ్చాయి. దేశవ్యాప్తంగా ఉత్తమ స్కోర్‌ను సాధించి జాతీయ స్థాయిలో ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున నగదును అందజేస్తారు. నీటి వసతికి 22, మరుగుదొడ్ల నిర్వహణకు 27, చేతుల శుభ్రతకు 14, ప్రవర్తన మార్పులకు 21, విద్యార్థుల నడవడికకు 20, మిషన్ లైఫ్ కార్యకలాపాలకు 21 మార్కులు కేటాయించారు.



ఆధ్యాత్మిక గ్రంథాలను ఆవిష్కరిస్తున్న చినజీయర్‌స్వామి. చిత్రంలో వరదారెడ్డి, పలువురు పండితులు

సంస్కార విద్య అవసరం

- స్వధర్మం కోసం కలిసికట్టుగా పోరాడుదాం
- ధార్మిక సదస్సులో చినజీయర్‌స్వామి పిలుపు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి మానవీయ విలువలు, ఉత్తమ సంస్కృతి ధార్మిక పరిరక్షణలాంటి వాటితో కూడిన సంస్కార విద్య అవసరమని, అది ప్రస్తుతం కొరవడుతోందని వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఉద్బోధించారు. అన్నాసాగర్‌లో గల ఎస్ఆర్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎస్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎ.వరదారెడ్డి 81 ఏళ్ల సహస్రచంద్ర దర్శనం వేడుకల్లో స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రముఖులైన 81 మంది దంపతులను లక్ష్మీనారాయణులుగా కొలుస్తూ ఘనంగా సత్కరింపజేశారు. సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ కార్యదర్శి సముద్రాల శఠగోపాచార్య అధ్యక్షతన జరిగిన ధార్మిక సదస్సులో అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ.. ప్రస్తుత చదువులను ఆయన రత్నాల విలువ లేకుండా బరువులు మోయడం లాంటిదేనని వ్యాఖ్యానించారు. ఎన్ని డిగ్రీలున్నా సంస్కారం లేని విద్య వ్యర్థమేనన్నారు. సనాతన ధర్మాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేస్తూ కొందరు పని గట్టుకొని హేళన చేస్తున్నారంటూ.. దీన్ని కలిసికట్టుగా స్వధర్మం, సంస్కారాల కోసం ప్రతీ హిందువు పోరాటం చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం స్థాపనతోపాటు విద్యాలయ ప్రాంగణంలో చక్కని రంగనాథస్వామి ఆలయాన్ని నిర్మింపజేసిన వరదారెడ్డి ధార్మిక సేవలను కొనియాడారు.

ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక గురువుగా మహా మహోపాధ్యాయ రఘునాథచార్యస్వామి నిలుస్తారని, వారి మార్గాన్నే అనుసరిస్తూ ఆధ్యాత్మిక బోధనలు హిందూ సంప్రదాయ పరిరక్షణకు నడుం బిగించిన చిన్నజీయర్‌స్వామి కూడా మార్గదర్శకులేనన్నారు.

ధార్మిక గ్రంథాల ఆవిష్కరణ

ఈ సందర్భంగా రఘునాథ వైజయంతి పేరిట అపూర్వ గ్రంథాన్ని చిన్నజీయర్ స్వామి ఆవిష్కరింపజేశారు. అదే విధంగా సత్ సంప్రదాయ పరిరక్షణ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఆళహ సింగరాచార్య రాసిన ఆచార్య వైభవం తెలుగు కృతికి వాసుదేవ తాతాచార్య రాసిన ఆంగ్ల అనువాద గ్రంథాన్ని స్వామివారు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మహా మహోపాధ్యాయ ఎస్‌వి రంగ రామానుజచార్య, భద్రాద్రి ఆలయ వేద పండితులు గుడిమెల్ల మురళీకృష్ణమాచార్య, భద్రాద్రి స్థలసాయిస్వామి, కేకే పరకాలన్‌స్వామి, వికాస తరంగిణి చైర్‌పర్సన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రంగనాయక స్వామి ఆలయ స్థానాచార్యుడు టీకే శ్రీనివాసాచార్య, ఆలయ ప్రధాన అర్చకుడు కె.రఘురామచార్యతోపాటు అర్చకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ఆలయాల అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చినజీయర్ స్వామికి రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ ప్రత్యేకంగా కలిసి వివరించారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎర్రబెల్లి స్వర్ణ, వెంకట్రాంరెడ్డి, అజీజ్‌ఖాన్

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల ఘన నివాళి

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బాబా సాహెబ్ విగ్రహం వద్ద మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. దేశ మొట్టమొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ పనిచేస్తూ దేశంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ సబ్బండ వర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, విజయశ్రీ రజాలి, మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా సంపత్ యాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, మాల మహానాడు జాతీయ నేత మన్నె బాబురావు, ప్రజా సంఘాల నాయకులు పుట్ట రవి, చుంచు రాజేందర్, మధుపాక ఎల్లయ్య, బొమ్మల్ల అంబేద్కర్, యాడాల రవీందర్, చిట్యాల బాబు తదితరులు పాల్గొన్నారు.

మేడారం పనుల్లో వేగం పెంచాలి



మేడారం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్ దివాకర

ములుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క- సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులు, మహాజాతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదే శించారు. మేడారంలో ఆయన శనివా రం పర్యటించారు. గద్దెల పునరుద్ధరణ తదితర అభి వృద్ధి పనులు, గోవిందరాజు, పగిడిద్ద రాజుల రాతి నిర్మాణాలు, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్, ప్రధాన ద్వారం రాతి స్తంభాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా అధికారులకు పలు సూచన లు చేశారు. అనంతరం మాట్లాడుతూ నిర్ణీత గడువు లోగా పనులు పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని, విరివిగా యంత్రాల ను ఉపయో గించుకోవాలన్నారు. జాతర సమయంలో కోట్లాది మం ది భక్తులు వనదేవతలను దర్శించుకునేం దుకు వస్తార ని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారు లు, కాం ట్రాక్టర్‌ను ఆదేశించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్యటించిన ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్

మేడారంలో ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ పర్యటించారు. వనదేవతలను దర్శించుకున్న ఆయన దేవాలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా దేవాలయం ఆవరణలో భద్రతా ఏర్పాట్లు, నిష్క్రమణ మార్గాలను, పోలీసింగ్ అవసరాలు, అత్యవసర సేవల సమన్వయం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. జాతర సమయంలో పోలీసులు చేపట్టాల్సిన కార్యాచరణకు అనుగుణంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ దయాకర్ తదితరులు ఉన్నారు.

మా గోస తాకి ఏసీబీకి పట్టుబడ్డారు..

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిపై గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల ఫైర్
- కలెక్టరేట్ ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు

సుబేదారి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఏసీబీకి పట్టుబడడటంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు సంబరాలు చేసుకున్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల సంఘం అధ్యక్షుడు బూర్గుల రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ.. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన బాధిత రైతులకు గ్రీన్‌ఫీల్డ్ హైవే చట్టం ప్రకారం భూములు తీసుకొని పరిహారం చెల్లించడంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అడ్డుపడ్డారని ఆరోపించారు. గతంలో ఆరెపల్లి, వంగపహాడ్ గ్రామస్థులకు మార్కెట్ ధర కంటే ఎక్కువే చెల్లించారని తెలిపారు. న్యాయబద్ధంగా రావాల్సిన పరిహారం ఇవ్వాలని కలెక్టర్, ప్రజాప్రతినిధులు, నేషనల్ హైవే అధికారులు చెప్పినా కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. రైతుల గోస తాకి ఏసీబీకి పట్టుబడ్డాడని సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి అవినీతి అధికారులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల సంఘం కార్యదర్శి బొల్లు రాజిరెడ్డి, నల్లల సతీష్, అడ్డూరి రాజేందర్, ఎరుకల రమేశ్, నల్లెల్ల దేవేందర్, శ్రీనివాస్, కమలాకర్, గంట సమ్మిరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

డీసీసీ చీఫ్‌లకు పంచాయతీ సవాల్

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత పెరిగింది. అయితే డీసీసీ చీఫ్‌లుగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వీరికి పంచాయతీ ఎన్నికలు రావటంతో.. మెజారిటీ స్థానాల్లో గెలవటం సవాల్‌గా మారింది. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 14న రెండో విడత, 17న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో అభ్యర్థులు ఎంపికతోపాటు గెలుపు బాట పట్టించే బాధ్యత నూతన డీసీసీ చీఫ్‌లపై ఉండటంతో వారికి అగ్నిపరీక్ష మారిందనే ప్రచారం ఉంది.

మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ జిల్లాలో ఆయూబ్‌ను అధిష్ఠానం డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఆయూబ్ నియామకాన్ని కొండా వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయూబ్.. కొండా దంపతులను మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలక నేతలందరినీ కలవటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వరంగల్ జిల్లాలో సంగెం, గీసుకొండ మండలాల్లో కొండా వర్గీయులు సర్పంచ్‌లుగా పలు గ్రామాల్లో పోటీగా నామినేషన్లు దాఖాలు చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పార్టీ అభ్యర్థులను పోటీకి ఖరారు చేయగా, కొండా వర్గం నుంచి నేతలు బరిలో ఉండటంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. డీసీసీ అధ్యక్షుడు అయూబ్ కొండా దంపతులతో చర్చించి, పోటీని తప్పించేంత సాహసం చేస్తారా? అనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఇది వరంగల్ అధ్యక్షుడి సత్తాకు పరీక్షగా పరిశీలకులు భావిస్తున్నారు.

అలాగే హనుమకొండ జిల్లా పరకాల, ఆత్మకూరు, నడికూడ, శాయంపేట, దామెర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కూడా వర్గపోరును పరిష్కరించేందుకు మంత్రి కొండా సురేఖ వర్గం నేతలతో చర్చించి, పోటీ నుంచి తప్పిస్తారా..? లేక చేతులెత్తేస్తారా..? అనేది కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డిలతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు నియోజకవర్గాల మండలాలు కూడా హనుమకొండ జిల్లాలో ఉన్నాయి. వీరందరినీ సమన్వయం చేసుకుంటే పార్టీని ముందుకు తీసుకెళ్లటం ఇనుగాల ముందున్న ప్రధాన సవాల్‌గా మారింది.

మరోవైపు జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలు ఆశించారు. ఈ ముగ్గురిలో ఎవరికీ పదవి రాకపోవటంతో ఆ నేతల వర్గం డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి మాటకు ప్రాధాన్యత ఇస్తారా..? అనేది చర్చనీయాంశంగా మారింది.

ఇక భూపాలపల్లి జిల్లా అధక్ష్యుడు భట్టు కరుణాకర్‌కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అభ్యర్థుల ఎంపికలో ఎంత ప్రాధాన్యత ఇస్తారా..? అనే చర్చ జరుగుతోంది. మహబూబాబాద్‌లో బలమైన నేతగా ఉన్న వెన్నం శ్రీకాంత్‌రెడ్డిని కాదని అధిష్ఠానం ఎమ్మెల్యే సతీమణి ఉమకు బాధ్యతలు అప్పగించింది. దీంతో వెన్నం వర్గం అసంతృప్తిగా ఉంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్‌లో అసంతృప్తిపై అధిష్ఠానం దృష్టి పెట్టడం లేదనే చర్చ జరుగుతోంది. డీసీసీ అధ్యక్షలకు పార్టీపరంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కీలక నేతలు ప్రాధాన్యత ఇస్తారా..? లేదా అనేది పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో వీరికి లభించే ప్రాధాన్యతను బట్టి తెలుస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

సమన్వయమే సవాల్

కాంగ్రెస్ పార్టీలో డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించిన నేతలను సమన్వయం చేసుకోవటం కొత్త చీఫ్‌లకు పరీక్ష మారింది. ఒక్కొక్క జిల్లా నుంచి అర డజనుకు పైగా కీలక నేతలు డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించారు. పదవి రాకపోవడంతో పాటు అధిష్ఠానం బుజ్జగింపులు కూడా చేయకపోవటంతో చాలామంది కూరలో కరివేపాకుగా మారామా..? అనే అసంతృప్తిలో ఉన్నారు. ఇలాంటి నేతలను సమన్వయం చేసుకోవటం నూతన డీసీసీ అధ్యక్షుల ముందున్న ప్రధాన సవాల్.

పేరుకే మండల కేంద్రం

- పంచాయతీ హోదా లేని 'కన్నాయిగూడెం'
- రాజన్నపేట జీపీలో కొనసాగింపు



రాజన్నపేట గ్రామ పంచాయతీ భవనం

కన్నాయిగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ హోదాలేని మండల కేంద్రంగా కన్నాయిగూడెం చరిత్రలో నిలిచి పోయింది. పేరుకే మండల కేంద్రమైనా పక్క గ్రామ పంచాయతీలో ఒక అమ్లెట్ విలేజ్‌గా ఉంది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం అప్పటి ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు లేకుండా కొత్త జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా 2016 అక్టోబరులో కొత్తగా కన్నాయిగూడెం మండలాన్ని ఏర్పాటు చేసింది. అయితే.. మండల కేంద్రమైనా నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజన్నపేట గ్రామ పంచాయతీలో ఇది అంతర్భాగంగా ఉంది. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో కన్నాయిగూడెంతో పాటు రాజన్న పేట, వెంకట్రావుపల్లి, గంగగూడెం ఉన్నాయి. మండల కేంద్రమైనా కన్నాయిగూడేనికి గ్రామ పంచాయతీ హోదా లేకపోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ చిన్న పనికైనా రాజన్నపేట పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నాయిగూడెం అనేది పూర్తిగా ఏజెన్సీ గ్రామం. ఇక్కడ 1990 వరకు పోలీస్‌స్టేషన్, బ్యాంకు, ప్రభుత్వాస్పత్రి ఉండేవి. భద్రత దృష్ట్యా అప్పట్లో వీటిని ఏటూరునాగారం తరలించారు. కొత్తగా మండలం ఆవిర్భావం తర్వాత ఇదే మండలంలోని తుపాకుల గూడెంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైనా కన్నాయిగూడేనికి పరిపాలన పరమైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ హోదా లేక పోవడంపై మండలంలోని పలువురు మేధావులు, ఉద్యోగులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం గిరిజన గూడాలని, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది కానీ మండల కేంద్రమైన కన్నాయిగూడేన్ని మాత్రం విస్మరించిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఊరు-పోరు
VOORU - PORU

నోటా గెలిస్తే ?

రెండోస్థానంలో ఉన్న అభ్యర్థి విజేత




వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఈసారి ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులెవరూ నచ్చక పోతే నోటామీద నొక్కొచ్చు. మరి బరిలో నిలిచిన అభ్యర్థుల కన్నా ఎక్కువ ఓట్లు నోటాకు వచ్చినా ఎన్నిక రద్దయ్యే అవకాశం లేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధనల ప్రకారం నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా రెండోస్థానంలో ఉన్న అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు అత్యధికంగా ఓట్లు వస్తే ఆ ఎన్నిక ఫలితాన్ని రద్దుచేసి మళ్లీ పోలింగ్ నిర్వహించాలని గతంలో సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయింది. 19కన్నా తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను తదుపరి ఐదేళ్లపాటు అన్ని ఎన్నికల్లో పోటీ చేయకుండా చూసేలా నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించిన కోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అయినా ఇప్పటివరకు సదరు అంశాలపై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

బల నిరూపణ పర్వం

వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రచారానికి తెరలేసింది. తమ బలాన్ని నిరూపించుకునే పనిలో అభ్యర్థులు ఉన్నారు. వెంకటాపూర్ మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీగా బల నిరూపణకు సిద్ధమయ్యారు. ఓటర్లకు తాయిలాలు ప్రకటిస్తూ ముందు విందు వినోదాలతోపాటు రోజువారీ కూలి డబ్బులు ఇస్తూ గ్రామాల్లో ఓటర్లను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పీడీ యాక్ట్‌పై జైలులో ఉన్నవారికీ ఓటు

- కేంద్ర సర్వీస్ ఉద్యోగులు, ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్



కేసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముందస్తు నేర నిరోధక చట్టం(పీడీ) కింద అరెస్టు అయిన వారు కూడా జైలు నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఇందుకోసం పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని వినియోగించనున్నారు. ఈ అవకాశం జైలులో ఉన్న పీడీ యాక్ట్ కింద అరెస్టు అయిన వారికి మాత్రమేనని, రిమాండ్, శిక్ష పడిన ఖైదీలకు లేదని పంచాయతీరాజ్ చట్టం చెబుతోంది. ముందస్తు నేర నిరోధక చట్టంలో అరెస్టు అయిన ఓటరును జాబితాలో ముందుగానే అధికారులు గుర్తిస్తారు. వారు ఏ జైలులో ఉన్నారో వారికి పోస్టల్ బ్యాలెట్ పేపర్‌ను పోస్టు ద్వారా పంపిస్తారు. జైలు అధికారుల ద్వారా సదరు ఓటరు పోస్టల్ బ్యాలెట్‌లో రహస్యంగా ఓటు వేసి కవర్‌ను సీల్ చేసి తిరిగి పోస్టులో ఆ గ్రామ పంచాయతీ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు.

ఇదే తరహాలో సర్వీస్ ఓటర్లు అనగా సైన్యం, కేంద్ర దళాలు, ప్రత్యేక సర్వీసుల్లో ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. వారు పనిచేస్తున్న చిరునామాకు పోస్టల్ బ్యాలెట్లు పంపిస్తారు. ఎన్నికల లెక్కింపు కంటే ముందుగా పోస్టల్ బ్యాలెట్ కవర్లు పోస్టు ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి చేరాల్సి ఉంటుంది. ఈ ఓట్లతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే రెవెన్యూ, పోలీసు, రవాణా, ఇంజనీరింగ్, పంచాయతీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది తమ సొంత మండలంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఇందుకోసం సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ఉద్యోగులు ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్లు, వాటిని వేసేందుకు గ్రామానికో బాక్సు చొప్పున ఏర్పాటు చేస్తారు. ఇలా పీడీ యాక్ట్ కింద అరెస్టయిన వారు, సర్వీస్ ఓటర్లు, ఎన్నికల సిబ్బంది వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల లెక్కింపులో సాధారణ ఓట్ల కంటే ముందే లెక్కిస్తుండడంతో వాటికి ప్రాధాన్యతను కల్పించినట్లవుతోంది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను కూడా అభ్యర్థులు ఫోన్లలో సంప్రదిస్తూ తమకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు.

ఇబ్రహీంపల్లి రేషన్ డీలర్ సస్పెన్షన్

కాటారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపల్లి రేషన్ డీలర్ ఎం.డి.కలీం సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 2న తనిఖీల్లో భాగంగా ట్రాలీ ఆటోలో తరలిస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులకు పట్టుబడ్డాయి. అందులో రేషన్ షాపు నుంచే నేరుగా బస్తాలను తరలిస్తున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో డీలర్‌పై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ ఆయనపై మూడు నెలల పాటు సస్పెన్షన్ వేటు వేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి : సిరికొండ

మొగుళ్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ, శాసన సభ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి కోరారు. మండలంలోని మేదరమెట్ల, అంకుశాపూర్, కొర్కిశాల గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. సర్పంచ్ అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు గాలి చంద్రమౌళి, రాములు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

గోవిందరావుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ వర్ధంతిని మండలంలోని పస్రా చౌరస్తాలో కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, తుడుందెబ్బ నాయకుడు మడి సాయిబాబా, సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, నాయకులు కదిరి నాగరాజు, కవిత,రాజేశ్వరి, సనప దేవేంద్ర-రాజేష్, సువర్ణ, శారద, బ్రహ్మచారి, అరుణ్, చేరాలు, పురుషోత్తంరెడ్డి, భద్రయ్య, జెమిని పాల్గొన్నారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. ఏఐఎస్ రాష్ట్ర ప్రచారకార్యదర్శి పుల్ల మల్లయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. దొడ్డి కిష్టయ్య, గుర్రపు రాజేందర్, కట్కూరి నర్సయ్య, దబ్బెట రమేష్, కట్కూరి మొగిలి, సరిగొమ్ముల రాజేందర్, కట్కూరి రాజు, గురకుంట్ల కిరణ్, సదానందం, శంకర్, తిరుపతి, చందర్ తదితరులు పాల్గొన్నారు.

● భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని భూపాలపల్లిలో పలు సంఘాలు, పార్టీల నాయకులు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీఎస్పీ జిల్లా కన్వీనర్ కొత్తూరి రవీందర్, జన సేన రాష్ట్ర నాయకుడు జోరుపోతుల సనత్‌కుమార్, బీసీ జేఏసీ చైర్మన్ పైడిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ వర్ధంతిని మండలంలోని కమలాపురం, రమణక్కపేట, అకినేపల్లిమల్లారం, తిమ్మంపేట, మంగపేటలో నిర్వహించారు. తెలంగాణ అంబేద్కర్ సంఘం, ప్రజా సంఘాల నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, యంపెల్లి వీరాస్వామి, రాజమల్ల సుకుమార్, చిట్టిమల్ల సమ్మయ్య, గుగ్గిళ్ళ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పస్రాలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. కళాశాల సీనియర్ అధ్యాపకుడు అబ్దుల్ గని అంబేద్కర్ గురించి ఆయన భరత జాతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సదాశివ్, సదానందం, మహేష్, కర్ర ప్రకాష్, మహేందర్, సునీల్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు షాబొద్దీన్ మీర్జా, అక్బర్‌బేగ్, చాగర్ల రాజు, సమ్మయ్య, సారయ్య, గట్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చోట్ల కాంగ్రెస్, బీజేపీ, అంబేద్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వ హించారు. విద్యుత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అంబేద్కర్ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, మాజీ ఎంపీపీ సమ్మయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు సమ్మిరెడ్డి, నాయకులు రాజు, లచ్చిరెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రభాకర్, రఘు, అజీజ్, విక్రమ్, రామన్న, రమేష్, కుమార్, సుజాత, శకుంతల, సమ్మయ్య, దాదామియా, దేవదాస్, మధు, మహేష్, రాంనారాయణ, బీజేపీ జిల్లా, మండల నాయకులు దుర్గం తిరుపతి, జిల్లెల్ల శ్రీశైలం, బొంతల రవి, రాజేందర్, ఏడీఈ రమేష్, ఏఈ ఉపేందర్, ఎల్ఐ కిరణ్ కాంత్, ఎల్ఎంలు ప్రవీణ్, చంద్రమౌళి, తిరుపతి, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని సందర్భంగా భూపాలపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్ధు, బీబీచారి, సింగనవేన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపం చాయతీ కార్యాలయం ఎదుట అంబేద్కర్ వర్ధంతిని బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు ఎమ్డీ. వలిబాబా, త్మ్మమ మల్లారెడ్డి, ఎమ్డీ. ఖాజా పాషా, లోటపేటల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● గణపురం (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని కేటీపీపీలో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి ఇన్‌చార్జి సీఈ పూలమాల వేసి నివాళులర్పించారు. కేటీపీపీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చందన్‌సింగ్, కేటీపీపీ ఇంజనీర్లు, ఆర్టిజన్లు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులు ఖర్చు పరిమితులను పాటించాలి

కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఖర్చు పరిమితులను తప్పకుండా పాటించాలని కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల మందికిపైగా జనాభా కలిగిన గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ.2 లక్షల 50వేలు, ఉపసర్పంచ్ అభ్యర్థి రూ.50 వేలు, 5వేలలోపు జనాభా ఉన్న సర్పంచ్ అభ్యర్థి రూ.లక్షా50 వేలు, ఉపసర్పంచ్ అభ్యర్థి రూ.30వేల లోపు ఖర్చు చేయాలని వివరించారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలని, ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుపేదలకు పలు సంక్షేమ పథకాలను అందించ డంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉన్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం, ఇస్సిపేట, ములుకలపల్లి, పిడిసిల్ల, వేములపల్లి, మొట్లపల్లి, పర్లపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యే శనివరాం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని, నాయకులు కొత్త, పాత అనే తేడాలేకుండా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలే పాలకులని, ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రెండేళ్లలో భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తుందని, రాబోయేరోజుల్లో మరింత అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థులు నరహరి బక్కిరెడ్డి, చాట్ల విజయ్, పిల్లల మల్లయ్య, ముకుందం, నల్లా అరుణతోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నైన్‌పాక గ్రామానికి చెందిన మురహరి కోటి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శనివారం పరామర్శించారు. మృతుడి సోదరుడైన కేటీఆర్ యువసేన మండల అధ్యక్షుడు తిరుపతిని ఓదార్చారు. వెంకటరమణారెడ్డి వెంట మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ నాయకులు నాగుల సాంబయ్య, యాదండ్ల గట్టయ్య, శ్రీపతి తిరుపతి, సావటి రవి, మాచర్ల తిరుపతి ఉన్నారు.

దాడులను ప్రోత్సహిస్తున్న పుట్ట మధు : కాంగ్రెస్

కాటారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కోసం ప్రజలను తప్పుదోవ పట్టించడానికి దాడుల సంస్కృతిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పోత్సహిస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల ప్రచార కమిటీ చైర్మన్ కుంభం రమేష్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు గుండాయిజం, రౌడీయిజం చేయాలని పుట్ట మధు ఉసిగోల్పోతున్నారని, రెండు రోజుల క్రితం గంగారంలో ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, నాయకులు తెప్పల దేవేందర్‌రెడ్డి, కడారి విక్రమ్, అశోక్, ఎం.డి. అజీజ్, సుజాత, శకుంతల, ప్రభాకర్, లచ్చిరెడ్డి, కుమార్‌యాదవ్, దేవేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

కాటారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగి హానికరమైన కార్యకలాపాలు పెరుగుతున్నాయని, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కాటారం డీఎస్పీ అమరగాని సూర్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల గురుకులంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' పేరిట నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై-2 రాజశేఖర్, ఎస్సై-3 మానస, గురుకులం ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కల్పన పాల్గొన్నారు.

రెండో విడత.. తేలిన లెక్క

(5వ పేజీ తరువాయి)

నామినేషన్‌లు వేశారు. వీటిలో 52 వార్డులు ఏకగ్రీవం కాగా 51 మంది ఉపసంహరించుకున్నారు. మిగిలిన 166 వార్డులకు 452 మంది పోటీలో నిలిచారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఎలేటిరామయ్యపల్లి సర్పంచ్‌గా కొడారి అశోక్, బావుసింగ్‌పల్లి సర్పంచ్‌గా ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, ముచినిపర్తి సర్పంచ్‌గా ఇంగిలి రాజేందర్, పాశిగడ్డతండ సర్పంచ్‌గా లావుడ్యా రవీందర్ నాయక్, చైన్‌పాక సర్పంచ్‌గా మాంత మనోహర్ ఎన్నికయ్యారు. ముచినిపర్తి, బావుసింగ్‌పల్లి, పాశిగడ్డతండా, చైన్‌పాక గ్రామాల్లో సర్పంచ్‌లో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. ఎలేటిరామయ్యపల్లిలో 6 వార్డులకు ఇద్దరు వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా నాలుగు వార్డులకు ఈనెల 14న ఎన్నికలు జరుగనున్నాయి.

టేకుమట్ల మండలంలో బరిలో ఉన్న అభ్యర్థులు ఎంత మంది అనేది అర్ధరాత్రి వరకు తేలలేదు. అయితే.. పలు పంచాయతీలు ఏకగ్రీయమైనట్లు తెలిసింది. వెలిశాల నుంచి ఏడుగురు, పెద్దంపల్లి నుంచి ముగ్గురు నామినేషన్లు దాఖలు అయ్యాయి. వెలిశాల నుంచి ఆరుగురు, పెద్దంపల్లి నుంచి ఇద్దరు నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో రెండు గ్రామాల నుంచి సర్పంచ్ బరిలో ఒక్కొక్కరే మిగిలారు. వెలిశాల నుంచి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి బొడ్డు తిరుపతి, పెద్దంపల్లి నుంచి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి వ్యాసనవేని శ్రీలేఖ సర్పంచ్‌లుగా ఏకగ్రీవమయ్యారని సమాచారం.

ఖరారైన రెండో విడత అభ్యర్థులు

- ములుగు జిల్లాలో తేలిన లెక్క
- ఏకగ్రీవంగా 15 గ్రామ పంచాయతీలు
- పలు జీపీలకు పూర్తిగా లేని పోలింగ్

ములుగు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో రెండో విడత పోటీ పడుతున్న అభ్యర్థుల లెక్క తేలింది. ములుగు, జేడీ మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణ పర్వం శని వారం ముగిసింది. మూడు మండలాల్లో 52 గ్రామ పంచాయతీలు, 462 వార్డులకు నామినేషన్లు దాఖలు కాగా వీటిలో మూడు మండలాల నుంచి 15 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయని అధికారులు ప్రకటించారు. మిగిలిన గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఆయా గ్రామాల్లో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య రసవత్తరమైన పోరు జరిగే అవకాశం ఉంది.

24 జీపీలు ఏకగ్రీవం

ములుగు జిల్లాలో 10 మండలాలు ఉండగా మంగపేట మండలానికి ఎన్నికలు జరగడంలేదు. మిగిలిన తొమ్మిది మండలాల్లోని 146 జీపీలు, 1290 వార్డులకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి విడతలో ఏటూరునాగారం, తాడ్వాయి, గోవింద రావుపేట మండలాల్లోని 48 జీపీలు, 420 వార్డులకు నామినేసన్ల స్వీకరణ జరిగింది. ఇందులో తొమ్మిది జీపీలు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడతలో ములుగు, జేడీ మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల్లోని 52 జీపీలు, 462 వార్డులకు నామినేషన్లు స్వీకరించారు. మూడు మండలాల నుంచి 15 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఏకగ్రీవమైన గ్రామాలు ఇవే...

రెండవ విడతలో ములుగు మండలం నుంచి 6 జీపీలు, జేడీ మల్లంపల్లి మండలం నుంచి 4 జీపీలు, వెంకటాపూర్ మండలం నుంచి 5 జీపీలు ఏకగ్రీవం అయ్యాయి. వాటిలో ములుగు మండలంలోని మంత్రి సీతక్క స్వగ్రామం జగ్గన్నపేట, రాయినిగూడెం, పెగడపల్లి, అంకన్నగూడెం, బంజరుపల్లి, కొత్తూరు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అలాగే జేడీ మల్లంపల్లి నుంచి ముద్దునూరుతండా, గుర్తూరుతండా, కొడిశలకుంట, దేవనగర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అదేవిధంగా వెంకటాపూర్ మండలంలో నర్సింగాపూర్, పాపయ్యపల్లి, అడవిరంగాపూర్, తిమ్మాపూర్, కేశవపూర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

మూడు మండలాల్లో బరిలో 898 మంది

ములుగు, జేడీ మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల నుంచి 15 జీపీలు ఏకగ్రీవం కాగా అందులో 11 మొత్తం ఏకగ్రీవమయ్యాయి. అయితే మిగిలిన నాలుగు గ్రామ పంచాయతీలతో పాటు 37 జీపీలకు ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. ఆయా గ్రామాల నుంచి సర్పంచ్, వార్డు మెంబర్లు 898 మంది పోటీలో ఉన్నారు. ములుగు మండలంలో 48 మంది సర్పంచ్ అభ్యర్థులు, 300 మంది వార్డు మెంబర్లు, జేడీ మల్లంపల్లి మండ లంలో 18 మంది సర్పంచ్, 142 మంది వార్డు మెంబర్లు, వెంకటాపూర్ మండలంలో 54 మంది సర్పంచ్, 336 మంది వార్డు మెంబర్లు ఉన్నారు.

ఇక్కడ ఎన్నికలు లేవు..

మొదటి, రెండో విడతలో 17 గ్రామ పంచాయతీలకు ఈ నెల 11, 14న పంచాయతీ ఎన్నికలు జరగడంలేదు. ఆ గ్రామాల సర్పంచ్‌తోపాటు, వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడం ఇందుకు కారణం. రెండు విడతల్లో 24 జీపీలు ఏకగ్రీవం కాగా మొదటి విడతలో గోవిందరావుపేట మండలంలోని ముత్తాపూర్, చల్వాయి, ఏటూరునాగరం మండలంలోని శంకరాజుపల్లి, తాడ్వాయి మండలంలోని అంకంపల్లి, నర్సాపూర్, పంబాపూర్ గ్రామాలు సర్పంచ్‌తో పాటు వార్డులు ఏకగ్రీవమయ్యాయి. అలాగే రెండో విడతలో జేడీ మల్లంపల్లి మండలంలోని గుర్తూరు తండా, ముద్దునూరుతండాకు, ములుగు మండలంలోని జగ్గన్నపేట, పెగడపల్లి, రాయినిగూడెం, అంకన్నగూడెం, కొత్తూరు, బంజరుపల్లి జీపీలకు, వెంకటాపూర్ మండలంలోని అడవి రంగాపూర్, నర్సింగాపూర్, తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలకు పూర్తిగా పాలకవర్గాలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తంగా 17 గ్రామ పంచాయతీల్లో పూర్తి ఏకగ్రీవమైనందుకు ఎన్నికలు జరపడంలేదని అధికారుల తెలిపారు. మిగిలిన ఏడు గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి.

బీఆర్ఎస్‌కు భారీ షాక్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పలిమెల మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి శనివారం ఉదయం తన సతీమణితో కలిసి కాంగ్రెస్ లో చేరారు. మూడు రోజులుగా అంతర్గత సమావేశాలు నిర్వహించిన ఆయన మండల కేంద్రం, మేజర్ గ్రామపంచాయతీ అయిన పలిమెల సర్పంచ్ పదవి కోసం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఊహించని పరిణామంతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా అయోమయంలో పడ్డారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు శనివారంతో ముగియనుండటంతో మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాలతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, సీనియర్ నాయకులు కట్కం అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకులు దండేరా రాజేందర్ ఆధ్వర్యంలో పావులు కదిపారు. ఈ పరిణామంతో కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేసిన తోలెం శ్రీనివాస్‌తో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థి పెద్ది రాజును సైతం నామినేషన్ విత్‌డ్రా చేయించేందుకు కృషిచేశారు. దీంతో పలిమెల గ్రామపంచాయతీ ఏకగ్రీవం కావడమే కాకుండా కాటారం సబ్ డివిజన్‌లో కాంగ్రెస్ ఖాతాలోకి తొలి సర్పంచ్ ఖాతా తెరిచినట్లయ్యింది.

ఎమ్మెల్యే గండ్ర సమక్షంలో చేరిక

బీఆర్ఎస్ పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజీ తిరుపతి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు భూపాలపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిరుపతి, ఆయన సతీమణి పుష్పలతకు ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నన్న, కుమ్మరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ములుగు ఎస్పీ, ఓఎస్డీ



సీపీతో మాట్లాడుతున్న ఎస్పీ, ఓఎస్డీ

ములుగు టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఓఎస్డీ శివం ఉపాధ్యాయ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు జిల్లాల మధ్య పోలీసింగ్ సమన్వయం, శాంతిభద్రతల వ్యవస్థ బలోపేతం, నేరాల నివారణ చర్యలు తదితర అంశాలపై చర్చించారు. వచ్చే నెలలో జరిగే మేడారం మహాజాతర ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వాహణపై సమాలోచన చేశారు.

బొగతలో విద్యార్థుల సందడి

వాజేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బొగత జలపాతం వద్ద ఆదివారం విద్యార్థులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పిక్నిక్‌పై వచ్చిన పిల్లలతో అక్కడి పరిసరాలు కోలాహలంగా మారాయి. జలపాతం వద్ద విద్యార్థులు ఆహ్లాదంగా గడిపారు. ఆటపాటలతో కేరింతలు కొడుతూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. హైదరబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు.

10న ములుగులో సదరం క్యాంపు

ములుగు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న ములుగు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో సదరం క్యాంపును నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఆర్డీవో శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతోపాటు మెడికల్ రిపోర్లలతో వచ్చి అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం

అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సెక్టోరియల్ అధికారులకు విధులు, బాధ్యతలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ గత ఎన్నికల నుభవాలను దృష్టిలో పెట్టుకుని డీఆర్సీ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా డిస్ట్రిబ్యూషన్ సాఫీగా జరిగేలా చూసుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణ సామగ్రి, పోలింగ్‌కు ముందు, తరువాత చేయాల్సిన, చేయకూడని, చెక్‌లిస్ట్ పంపిణీ చేయడం జరిగిందని, ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కనీసం మూడుసార్లు ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లి మౌలిక సదుపాయాలు చూసుకోవాలని, కనీస వసతులు ఉన్నట్లు ధ్రువీకరణపత్రం సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్‌స్టేషన్లలో ఎలాంటి రాతలు ఉండకూడదని, 100మీటర్ల పరిధిలో రాజకీయపార్టీలకు సంబంధించిన పోస్టర్లు, సామగ్రి ఉండకుండా పర్యవేక్షించుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో సెక్టార్‌కు చెందిన పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ అధికారులకు సామగ్రి పంపిణీ సెక్యూరిటీతో బ్యాలెట్ బాక్సులు కేటాయించిన వాహనాల్లో ఆయా పోలింగ్‌కేంద్రాలకు సకాలంలో చేరాలన్నారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఓటర్ల నమోదు శాతం నివేదిక పంపించాలన్నారు.

నామినేషన్ పత్రాల పరిశీలన

వాజేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడో విడతలో జరగనున్న నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారం ముగియడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వాటి పత్రాలను పత్రాలను శనివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా మొత్తం 17 పంచాయతీలలో సర్పంచ్ స్థానాలు 85 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 65 అర్హత పొందారు. 152 వార్డులకు 352 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలో పెదగొల్లగుడెంలో ఓ వార్డు మహిళ ఎస్టీకి రిజర్వు కాగా పురుష అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఆ నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు.

వెంకటాపురం మండలంలో...

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో ఐదు క్లస్టర్లను ఏర్పాటు చేసి నామినేషన్ ప్రక్రియను ఈనెల 3 నుంచి 5 వరకు రిటర్నింగ్ అధికారులు చేపట్టారు. 18 సర్పంచ్ స్థానాలకు 103 మంది అభ్యర్థులు, 166వార్డు స్థానాలకు 405మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. శనివారం ఆయా క్లస్టర్ల వారీగా నామినేషన్లను, అభ్యర్థుల పరిశీలన చేశారు. 18 పంచాయతీల్లో 87మంది సర్పంచ్ అభ్యర్థులు, 384మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు. కాగా, రామచంద్రాపురం పంచాయతీలోని ఒకటోవార్డు, రాచపల్లిలోని 2,4,6,8వార్డులు, బోదాపురంలోని 8వవార్డు, మొర్రవానిగూడెంలో 2,7,8వార్డులకు ఒక్కో నామినేషన్ రావడంతో 14వార్డులు ఏకగ్రీవం అయినట్లు అధికారులు తెలిపారు.

ఉన్నత విద్య కోసం వెళ్లి..

(5వ పేజీ తరువాయి)

అమెరికాకు వెళ్లింది. జయా కర్‌రెడ్డి హైదరాబాద్ హైటెక్ సిటీలో టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తల్లి గోపు మరియా శైలజ బచ్చన్నపేట మండలం పీఎస్‌లో ఎస్టీటీగా పని చేశారు. ఇటీవల డిప్యూటేషన్‌పై హైదరాబాద్ ఎన్‌సీఆర్టీకి వెళ్లారు. కొన్నేళ్లుగా ఈ కుటుంబం హైదరాబాద్‌లోని మేడిపల్లిలో నివాసం ఉంటోంది.

సహజారెడ్డి బీటెక్ పూర్తి చేసిన తర్వాత 2021లో ఎంఎస్ చేయడానికి అమెరికాకు వెళ్లింది. బర్మింగ్‌హామ్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ చదువుకుంటోంది. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి సహజారెడ్డి ఉంటున్న అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న మరో అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో వేగంగా మంటలు వ్యాపించి సహజారెడ్డి ఉంటున్న ఫ్లాట్‌కు అంటుకున్నాయి. ఫ్లాట్‌లో సహజారెడ్డితోపాటు మరో 13 మంది ఉంటున్నారు. మంటలు చెలరేగడంతో 10మంది తప్పించుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సహజారెడ్డితో పాటు మరో స్నేహితురాలు నిద్రమత్తులో ఉన్నారు. అప్పటికే మంటలతో పాటు పొగలు వ్యాపించడంతో కిందకు పోయే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే సమయంలో కాలుతున్న చెక్కలు ఆమెపై పడడంతో 80శాతం మేర శరీరం కాలిపోయింది. అక్కడ ఉన్నవారు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సహజారెడ్డి మరణ వార్త తెలియడంతో ఆమె స్వగ్రామ మైన గుంటూరుపల్లిలో విషాదం అలుముకుంది. ఈ నెల 11న ఆమె మృతదేహం గుంటూరుపల్లికి చేరుకుంటుందని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రామప్పను సందర్శించిన హైకోర్టు జడ్జి

(5వ పేజీ తరువాయి)

బిల్ల శ్రీనివాస్ ఆయన్న సత్కరించారు. అనంతరం ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించిన జడ్జి మంత్రముగ్ధులయ్యారు. ఆయన వెంట ములుగు, భూపాలపల్లి జడ్జిలు సూర్యచంద్రకళ, రమేష్‌బాబు, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న, దిలీప్ నాయక్, తహసీల్దార్ గిరిబాబు, సీఐ సురేష్, ఎస్సై చల్ల రాజు, ఈవో శ్రీనివాస్, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు. అదేవిధంగా రామప్ప దేవాలయాన్ని ఎన్నికల అబ్జర్వర్ కిల్లు శివకుమార్ నాయుడు సందర్శించారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ ఆయనకు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ గిరిబాబు, ఎస్సై చల్ల రాజు, టూరిస్ట్, పోలీస్, దేవాదాయ, పురావస్తు, టూరిజంశాఖల సిబ్బంది ఉన్నారు.